సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నల్లకుంట: నల్లకుంటకు చెందిన వై. శ్రీనివాస్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.1.70 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కార్పొరేటర్ అమృతతో కలిసి బాధితుడికి ఎల్‌ఓసీ చెక్కును శనివారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతం రావు, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్, అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్ రాజ్ పాల్గొన్నారు.

నియామకం



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా ఎం.వసంతచారి నియమితులయ్యారు. ఈమేరకు నియోజకవర్గ కన్వీనర్ మద్దూరి శివాజీ చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు రాహుల్‌గౌడ్, భార్గవ్‌చారి, సాయినాథ్, పాట్టి తులసీ, లీగల్ సెల్ ఇన్‌చార్జి కార్తీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



కాచిగూడ: ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఈస్ట్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్ శ్యామ్ సూచించారు. యంగ్ మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాచిగూడ చెప్పల్‌బజార్‌లో ఏర్పాటు చేయనున్న గణేశ్ మండప నిర్వాహకుడు సాయిబాబాకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు ఏర్పాట్ల కోసం గ్లౌజ్‌లు, టేపులు, టెస్టర్లను అందజేశారు.

డ్రంకన్ డ్రైవ్ తనిఖీ



చిక్కడపల్లి: వీఎస్టీ రాంనగర్ అజామాబాద్ వెళ్లే దారిలో బయోలాజికల్ ఈ లిమిటెడ్ ఎక్స్ రోడ్డు వద్ద సెంట్రల్ ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు, అడిషనల్ డీసీపీ రాములు, సెంట్రల్ జోన్ ఏసీపీ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. చిక్కడపల్లి ట్రాఫిక్ ఎస్‌ఐలు యాదగిరి, సాయిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

కాచిగూడ: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ సమీపంలో ఓ మహిళ (65) రైలు ఢీకొని గాయపడింది. ఆమెను చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో సెల్‌ఫోన్, నగదు చోరీ

రైల్లో బెంగుళూర్ నుంచి కాచిగూడకు వస్తుండగా సెల్‌ఫోన్, నగదు చోరీకి గురైన ఘటన పై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు తిరుచ్చికి చెందిన ఎ.రాజేశ్ (61) బెంగుళూర్ నుంచి కాచిగూడకు రైల్లో వస్తుండగా మహబూబ్‌నగర్ వద్ద తన జేబులో నుంచి సెల్‌ఫోన్, రూ.20 వేల నగదు ఉన్న పర్సు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ కోసం మహబూబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

రైల్లో ల్యాప్‌టాప్..

రైల్లో ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీకి గురైన ఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్ రావు (46) రైల్లో కాచిగూడకు వస్తుండగా నల్గొండ సమీపంలో చూసుకునే సరికి ల్యాప్‌టాప్ బ్యాగ్, రూ.4 వేలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ కోసం నల్గొండ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఆకట్టుకున్న ఆగమన్ ఈవెంట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పండరీనాథ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో శనివారం రాత్రి నిర్వహించిన ఆగమన్ ఈవెంట్ (గణపతి విగ్రహ ప్రారంభం) ఆకట్టుకున్నది. రంగురంగుల విద్యుత్ దీపాలు బ్యాండు మేళాలతో లంబోధరుడిని తీసుకువచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు వంశీ, సతీశ్, రాహుల్ యాదవ్, గణేశ్, అనిరుధ్, నందు, కిరణ్, తరుణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లోకేశ్ యాదవ్, బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జై సింహ, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో.. రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- భరత్‌నగర్ బస్తీలో పర్యటన



భరత్‌నగర్ బస్తీలో నూతన కమ్యూనిటీ హాల్ వద్ద స్థానికులతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్ బస్తీలో పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి బిల్లులు, ఆసరా పింఛన్లు వంటి సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. అలాగే పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను మంత్రి సత్కరించి అభినందించారు. స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్థానిక నాయకత్వం, తన కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, ఎడెల్లి అజయ్‌కుమార్, శ్యాంరాజు, నాగరాజు చారి, బాలు, చుక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత్ సేవాశ్రమ్ సంఘ్ సంస్థ ఆధ్వర్యంలో సీపీఎల్ రోడ్డు లకోటియా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శనివారం నోట్ బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని వారి సేవలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక సారించాలని, వారికి తల్లిదండ్రులు కూడా సహకరించాలని సూచించారు. అనంతరం గోల్నాక తులసీరామ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మునీశ్వరానంద స్వామి,వెంకటేశ్వరనంద స్వామి, ఉపాధ్యాయులు, కార్పొరేటర్లు కన్నె ఉమారమేశ్ యాదవ్, అమృత, బీజేపీ నాయకులు లంకల దీపక్‌రెడ్డి, ఎస్.గౌతంరావు, జి.ఆనంద్‌గౌడ్, అజయ్‌కుమార్, శ్యాంరాజ్, నాగభూషణంచారి, నరేశ్ గౌడ్, మైలారం రాజు, యశ్వంత్, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలు కాపాడుతాం



అధ్యక్షుడిగా ఎన్నికైన మొగుళ్ల రాజిరెడ్డిని సన్మానిస్తున్న నేతలు

కాచిగూడ: హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు ఉద్యోగుల ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించేందుకు కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు ఐఎన్‌టీయూసీ ఒకే గొడుగు కింద పనిచేయాలని నిర్ణయించినట్లు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి తెలిపారు. నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన కాంగ్రెస్ అనుబంధ సంఘాల సమావేశంలో ఈ మేరకు జేఏసీ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్య నిర్వాహక కమిటీ సభ్యులుగా టీపీ రాఘవేంద్ర రాజ్, ఎ.శ్రావణ్ కుమార్, మొహ్మద్ జహంగీర్, బి.దేవేందర్, చంద్రశేఖర్, సయ్యద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్‌రావు, ఎం.రాజా, బి.జైరాజ్, సురేశ్ బాబు, కె.రామరాజు, బి.భూమయ్యను ఎన్నుకున్నారు. ఐఎన్‌టీయూసీ నాయకత్వంలో అనుబంధ సంఘాలన్నీ ఐక్యత, పారదర్శకత, నిబద్ధతతో పనిచేయాలని జేఏసీ ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఆస్మిక కేర్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన



మాట్లాడుతున్న ఆస్మిక కేర్ రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ రావు

కవాడిగూడ: ఆస్మిక కేర్ సంఘం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో శనివారం మానసిక రోగుల కుటుంబాలు, సంరక్షకుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్మిక అధ్యక్షుడు రాంమోహన్ రావు మాట్లాడుతూ.. 108 అంబులెన్స్‌లో కొన్నింటిని 108 (ఎం)గా మార్చి శిక్షణ పొందిన సిబ్బందితో దూకుడుగా ప్రవర్తించే రోగులకు సురక్షితంగా తరలించే సౌకర్యం కల్పించాలన్నారు. సంరక్షకుల వయస్సు పెరిగే కొద్దీ మానసిక రోగులు మరింత ఆందోళన చెందుతున్నారని ప్రభుత్వం దీర్ఘకాలిక సహాయక వ్యవస్థను రూపొందించాలని కోరారు. బీమా కంపెనీలు మానసిక రోగుల క్లైమ్‌లు ఆలస్యం చేస్తున్నాయని, ఇది నియంత్రణ సంస్థ మార్గదర్శకాలను ఉల్లంఘించడమే అవుతందన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆస్మిక ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రవత్ జయా, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ , కోశాధికారి భైరవ ప్రసాద్, డాక్టర్ నిర్మల జగన్నాథ్, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్, అధికారులు

చిక్కడపల్లి: అరుంధతినగర్‌లో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ పనులను గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానికుల విజ్ఞప్తి మేరకు గణేశ్‌నవరాత్రుల అనంతరం నిర్మాణాన్ని ప్రారంభించాలని ఆమె అధికారులను కోరగా వారు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వాటర్ వార్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఏఈ అబ్దుల్ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నేతలు నవీన్‌కుమార్, ఆనంద్‌రావు, సాయికుమార్, బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సతీశ్, పవన్, విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు ప్రత్యేక చట్టం తేవాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీఎల్‌ఎఫ్ వ్యవస్థాపకుడు నల్లా సూర్య ప్రకాశ్

కవాడిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి పటిష్టంగా అమలు చేయాలన్నారు. బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్య ప్రకాశ్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధనకు ఐక్య పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర కన్వీనర్ వెంకట్ మాట్లాడుతూ.. రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వని పార్టీలను బీసీలంతా రాజకీయంగా బహిష్కరించాలన్నారు. రాష్ట్ర నాయకుడు గాదగోని రవి మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ రాజకీయ రంగంతోపాటు భూమిలో సైతం వాటా పంపిణీ జరగాలని డిమాండ్ చేశారు. ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి మాట్లాడుతూ.. రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమాన్ని చేపట్టాలన్నారు. బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కె. పర్వతాలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నాయకులు ఎస్ సిద్ధి రాములు, సబ్బని రాములు, వస్కుల మట్టయ్య, బీసీ ఉద్యమ నాయకుడు నేతాజీ , వనం సుధాకర్, కె.గోపాల్, వడ్ల సాయి, కృష్ణమాస్, సావిత్రీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉత్తర భారతీయుల కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఉత్తర భారతీయ సమాజ్ సేవా సంఘం అధ్యక్షుడు రాజేంద్ర నిషాద్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం చుట్టూ పక్కలా జరుగుతున్న అనేక భవన అంతస్తుల నిర్మాణంలో ఉత్తరాది నుంచి వచ్చిన వలస కార్మికులే ఉన్నారన్నారు. వారికి ఎలాంటి ఆపద వచ్చిన తమ సంఘం అండగా ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సునీల్ నిషాద్ అభిమన్యు, అరుణ్ చౌహాన్, లాల్ బహుదూర్, నందలాల్ శర్మ, జితేంద్ర, దశరథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



కాచిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈనెల 25న ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన సత్యాగ్రహ దీక్షా పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టపరంగా రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. దీక్షను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ రఘురాం నేత, నీలం వెంకటేశ్, సి.రాజేందర్, అనంతయ్య, రాజు నేత, చెరుకు మణికంఠ, పెద్ది జగదీశ్, జెల్ల నరేందర్, శివ, వాణి రెడ్డి, కుమార్ యాదవ్, నరేశ్ గౌడ్, లింగయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న అర్వింద్‌కుమార్

చిక్కడపల్లి: మట్టి గణపతులనే పూజించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అర్వింద్‌కుమార్ యాదవ్ కోరారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద కాంగ్రెస్ సీనియర్ నేత గుర్రం శంకర్, ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో పి.లక్ష్మారెడ్డితో కలిసి మట్టి వినాయక ప్రతిమలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, ధర్మకర్తలు అభిషేక్ కెనడీ, శీలం సత్యనారాయణ, మేడి సురేశ్, మోహన్, జార్జ్, నవీన్, భానుచందర్, గుర్రం దినేశ్, నర్సింగరావు, గుండు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీరనిలోటు

చిక్కడపల్లి: సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీరని లోటు అని చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు చిక్కా దేవదాసు అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ.. పార్లమెంట్ సభ్యుడిగా బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. చంద్ర రాజేశ్వర్‌రావు తర్వాత జాతీయ కార్యదర్శిగా రెండో వ్యక్తిగా సురవరం నిలిచారన్నారు.

తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించండి



ఫోన్లో జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: డివిజన్‌లోని వైఎస్‌ఆర్ పార్కు కాలనీలో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే శనివారం కాలనీలో పర్యటించారు. అలాగే జలమండలి అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఆఫీసుల్లో కూర్చుని మాట్లాడితే ఎలా అని.. కాలనీలో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని మండిపడ్డారు. వెంటనే సక్రమంగా తాగునీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎయిర్‌టెల్ రాజు, వైఎస్‌ఆర్ పార్కు కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, కాలనీ నాయకులు యాదగిరి, వెంకటేశ్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో ..

ముషీరాబాద్: డివిజన్‌లోని భరత్‌నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈమేరకు స్థానికులు ఎండీ మోహిన్, జి.రాజు, క్రాంతికుమార్ తదితరులు ముషీరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో సెక్షన్ మేనేజర్ సురేశ్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. రెండు రోజులుగా నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నీటి సరఫరా సమయం మార్చడం వల్లే కొంత ఇబ్బందులు తలెత్తాయని, భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సురేశ్‌కుమార్ హామీనిచ్చారు.

ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి



అంబర్‌పేట: ఓటు చోరీ కాకుండా ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీ వి.హనుమంతారావు సూచించారు. ఓటు చోరీపై శనివారం అంబర్‌పేట మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం నుంచి పటేల్‌నగర్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. చోరీ ఓట్ల విషయమై తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ కేంద్రాన్ని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనుంచి ఓటరు జాబితాపై తాము ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, అప్సర్ యూసుఫ్ జాహి, శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, నారాయణస్వామి, పులి జగన్, నాయకులు పాల్గొన్నారు.

పాలకులు ప్రజల్ని సమానత్వం వైపు నడిపించాలి



మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలకులు ప్రజల్ని సమానత్వం వైపు నడిపించాలని పీఓడబ్ల్యూయూ జాతీయ నాయకురాలు వి. సంధ్య డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీఓడబ్ల్యూయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'మహిళల స్వయం నిర్ణయాధికార హక్కు' అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ప్రేమ, మన చదువు, మన జీవితం మనమే నిర్ణయించుకోవాలని ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. వలస కూలీ మహిళలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మహిళల నిర్ణయాధికార హక్కులపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూయూ జాతీయ నాయకురాలు జి.ఝాన్సీ, పీఓడబ్ల్యూయూ అధ్యక్షురాలు అనసూయ, స్వరూప, అందె మంగ, బండారు విజయ, కొండవీటి సత్యవతి, అరుణ, జానకి, ఊకే పద్మ, గుత్త జ్యోత్స్న, భారతి, ప్రేమలత, అంబికా, జి.అనురాధా, సీత తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయ సమీపంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేశ్, కోశాధికారి తొడుపనూరి రవీందర్ మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అన్నదాతలు ప్రొద్దుటూరు నరసింహరావు, తమ్మన వేణుగోపాల్ సౌజన్యంతో జరిగిన అన్నదానంలో సంఘం పూర్వ అధ్యక్షుడు సింగారపు శంకర్, సురేందర్ గుప్తా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో స్థానిక శివాలయం చౌరస్తాలోని గౌరీ శంకర ఆలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీకాంత్‌యాదవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ

ముషీరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో ఖేలో ఇండియా, అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగల్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది బాలికలు పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మీర్ వాహజ్‌ఖాన్, కోశాధికారి వరప్రసాద్, కాంగ్రెస్ నాయకులు శ్రీవిద్యా ప్రశాంత్‌గౌడ్, రాహుల్, గణేశ్, నరేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



అనురాధాకు డాక్టరేట్ అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఆదర్శ పాఠశాల బోధ్ ప్రధానోపాధ్యాయురాలు, రాంనగర్‌కు చెందిన ఎస్.అనురాధా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. దీంతో ఐఎస్ఆర్‌వో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమెను ఉపాధ్యాయులు, బంధువులు అభినందించారు.

యండమూరి వీరేంద్రనాథ్‌కు పురస్కారం



యండమూరి వీరేంద్రనాథ్‌కు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి: సాంస్కృతిక వేదిక రామ్‌కుమార్ కళారవీందం ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను త్యాగరాయ గానసభలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ నవల, సినీ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ యండమూరి వీరేంద్రనాథ్‌కు జీవన పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, రామసత్యనారాయణ, దైవజ్ఞశర్మ, చింతలపూడి త్రినాథరావు, రామ్‌కుమార్, రేణుకాప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.